చిన్నారులకు 44 రకాల వైద్య పరీక్షలు : డిఎంహెచ్‌ఒ

భీమవరం:జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలను వైద్య సిబ్బంది సందర్శించి పరీక్షలు నిర్వహించే కార్యక్రమం శనివారం ప్రారంభించినట్లు జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు తెలిపారు. స్థానిక డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ఆధ్వర్యాన జిల్లా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను ఆరోగ్య కార్యకర్త, కమ్యూనిటీ హెల్తాఫీసర్ సందర్శిస్తారన్నారు. జిల్లాలోని 1616 అంగన్వాడీ కేంద్రాలు, 1436 ప్రభుత్వ పాఠశాలల్లోని 18,287 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి పుట్టుకతో వచ్చే లోపాలను, పిల్లలకు వచ్చే రక్తహీనత సమస్యలు, పిల్లలు ఎదిగే క్రమంలో ఏర్పడే సమస్యలు యుక్త వయస్సులో వచ్చే ఆరోగ్య సమస్యలు మొత్తం 44 రకాల వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమ సమన్వయాధికారి డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్, డిఇఒ నాగరాజు, మహిళా శిశు సంక్షేమాధికారి బి.సుజాతరాణి, సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి పాల్గొన్నారు.

డెల్టా ఆధునికీకరణ కదిలేనా..!

ఐదేళ్లుగా పడకేసిన పనులు

పంట కాల్వలు పూడుకుపోయి

నీరు పారని దుస్థితి

ప్రతియేటా వర్షాలకు వేల ఎకరాల్లో పంట ముంపు

రెండు జిల్లాల్లో రూ.470 కోట్లు విలువైన

పనులకు ప్రతిపాదనలు

ఏప్రిల్ 15న కాలువల మూసివేతకు

జిల్లాసాగునీటి సలహామండలిలో నిర్ణయం

జనవరిలో టెండర్లు పిలిస్తేనా పనులు ముందుకు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 80 శాతం వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయ రంగానికి అత్యంత ప్రధానమైన డెల్టాలోని పంట కాలువల ఆధునికీకరణ గురించి మాత్రం ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రతియేటా వర్షాలు, వరదలు, తుఫాన్లకు వేలాది ఎకరాల్లో పంట నష్టపోయి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో మూడుసార్లు విరుచుకుపడిన వరదలు, వర్షాలకు 29 వేల ఎకరాల్లో పంటను రైతులు కోల్పోయారు. రూ.27 కోట్లు మేర పంట నష్టం అందించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. వైసిపి ఐదేళ్ల పాలనలో డెల్టా ఆధునికీకరణ ఊసే లేకుండాపోయింది. దీంతో పంట కాలువలన్నీ మెరకదేరి నీరు కిందకు పారని దుస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షానికి సైతం పంట పొలాలు మునిగిపోతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు 11 ప్రధాన కాలువలు, 300కుపైగా ఉపకాలువ ద్వారా సాగునీరు అందుతోంది. రెండు జిల్లాల్లో దాదాపు ఐదు లక్షల ఎకరాల వరకూ డెల్టా ఆయకట్టుగా ఉంది. ప్రతియేటా డెల్టా ఆధునికీకరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి అధికారులు ప్రభుత్వానికి నివేదించడం, వాటిని పాలకులు పక్కన పెట్టేయడం పరిపాటైంది. ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో ఖరీఫ్‌లో వరదల ముంపు, దాళ్వాలో సాగునీటి ఎద్దడి సమస్యతో రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులు తూతూమంత్రంగా సాగించి చేతులు దులుపుకుంటున్న పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, జలవనరుల శాఖ మంత్రిగా జిల్లాకు చెందిన నిమ్మల రామానాయుడు ఉండటంతో ఈ ఏడాదైనా డెల్టా ఆధునికీకరణ పనులు జరిగేనా అనే చర్చ రైతుల్లో సాగుతోంది. డెల్టా ఆధునికీకరణ పనులు చేయాలంటే ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళిక అత్యంత ముఖ్యమనే చర్చ సాగుతోంది.

జనవరిలో టెండర్లు పూర్తయితేనే పనులు ముందుకు

ప్రతియేటా నవంబర్ మూడో వారంలో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలు జరుగుతాయి. ఈ సమావేశానికి మంత్రులు, ఎంఎల్‌ఎలు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొంటారు. దాళ్వాకు సాగునీటి సరఫరా, తాగునీటికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపైనా, డెల్టా ఆధునికీకరణ పనులపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాగునీటి పారుదల సలహా మండలి సమావేశాలు మమ అన్నట్లు సాగుతున్నాయి. ఇప్పటికే పశ్చిమలో సాగునీటి సలహా మండలి సమావేశం పూర్తయ్యింది. ఏలూరు జిల్లాలో నిర్వహించాలని తలపెట్టి వాయిదా వేశారు. ఇక్కడ కూడా కొద్దిరోజుల్లో జరిగే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఆధునికీకరణ పనులపై చర్చ లేకుండాపోయింది. ఈ ఏడాది పశ్చిమలో రూ.310 కోట్లు, ఏలూరు జిల్లాలో దాదాపు రూ.160 కోట్లు విలువైన పనులకు సంబంధించి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిని ఆమోదిస్తేనే డెల్టా ఆధునికీకరణ పనులు జరిగే అవకాశం ఉంటుంది. డిసెంబర్ నెలాఖరులోపు ఆధునికీకరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. అప్పుడే జవవరిలో టెండర్లు పిలిచేందుకు అవకాశం ఉంటుంది. జనవరిలోపు టెండర్ల ప్రక్రియ పూర్తయితేనే డెల్టా ఆధునికీకరణ పనులు ముందుకు సాగుతాయి. పశ్చిమలో జరిగిన జిల్లా సాగునీటి పారుదల సలహా మండలి సమావేశంలో ఏప్రిల్ 15న కాలువలు మూసివేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. మళ్లీ జూన్ ఒకటిన కాలువలకు నీరు విడుదల చేయనున్నారు. జనవరి నెలాఖరులోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తే కాలువలు మూసివేసిన వెంటనే ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఈ విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోననే చర్చ రైతుల్లో సాగుతోంది. ఈ ఏడాదైనా డెల్టా ఆధునికీకరణ పనులు చేయాలని రైతులు కోరుతున్నారు.

మినీ అంగన్వాడీలను..

మెయిన్ సెంటర్లుగా మార్చండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణి

భీమవరం కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నా

ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అంగన్వాడీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, తక్షణం వాటిని పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద శనివారం అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ పేద గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించి ప్రీ స్కూల్లో నడపడంలో మినీ వర్కర్లు అనేక సేవలు చేస్తున్నారన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని అనేకసార్లు విన్నవించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని మండిపడ్డారు. వెంటనే మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్కర్, హెల్పర్ ఇద్దరి పని మినీ వర్కర్ చేయాల్సి వస్తుందన్నారు. అనారోగ్యం పాలైనా, అత్యవసర సందర్భంలోగాని కనీసం సెలవు పెట్టడానికి అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 42 రోజులపాటు సుదీర్ఘమైన సమ్మె సందర్భంగా మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చుతామని అంగీకరించి మినిట్స్ కాపీ సంతకం చేసి అందించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్తే సర్వే చేయించి మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని హామీ ఇచ్చారన్నారు. రోజురోజుకీ నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నా, దానికి అనుగుణంగా వేతనాలు ఏమాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మినీ వర్కర్లకు ఖాళీ పోస్టుల్లో ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. సర్వీస్‌లో ఉండి చనిపోయిన వారికి మట్టి ఖర్చులు చెల్లించే జిఒను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్‌ఒ, ఐసిడిఎస్ ఎపిడీకి అందించారు. దీనిపై స్పందించిన వారు మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వైట్ల ఉషారాణి, జిల్లా కమిటీ సభ్యులు శ్రీదేవి, శ్యామలకుమారి, ప్రియదర్శిని, మినీ వర్కర్లు ఎస్.రూప, కె.ప్రశాంతి, వి.ప్రశాంతి, పి.విజయకుమారి, జె.కనకదుర్గ పాల్గొన్నారు.

ఏలూరు జిల్లాలోనే గణపవరం విద్యాశాఖ..!

250 మంది ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు

గతంలో ఎన్నికల విధులు.. ఇప్పుడేమో శిక్షణ

యుటిఎఫ్, పిడిఎఫ్ ఎంఎల్‌సిల పోరాట ఫలితంగా పశ్చిమ విద్యాశాఖ ఆధీనంలోకి తీసుకొస్తూ ప్రొసీడింగ్స్

అమలు కాని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలు

18 మంది ఉపాధ్యాయులకు ఏలూరు జిల్లాలో నీటిసంఘం ఎన్నికల విధులు



File No.ESE02-12021/110/2022-EST 2-CSE-Part(3)

PROCEEDINGS OF THE DIRECTOR OF SCHOOL EDUCATION
ANDHRA PRADESH
Present: Sri Vijay Rama Raju.V., I.A.S.,

Rc.No. ESE02-12021/110/2022-EST 2-CSE-Part(3) Dt:16/10/2024

Sub: School Education Department – A.P.E.S – Shift the Ganapavaram Mandal from Eluru Education Division, Eluru District, to Bhimavaram Education Division, West Godavari District – Certain Instructions Issued.

Read: 1) G.O.Ms.No.62, Finance (HR.I-PLG.&POLICY) Dept, Dt:03.04. 2022.
2) This office Procgs.Rc.no.ESE02-11021/67/2022-JD-VE-CSE, Dt:04.04.2022
3) Lr.Rc.No.ESE02-12021/110/2022-EST2-CSE,Dated:05/06/ 2022.
4) G.O.Ms.No.51, Revenue (Lands.IV), dated 16.02.2023
5) G.O. Ms. No. 56 SE eServices-1. Dept., dated 20-06-2023.
6) This office Procgs.Rc.no.ESE02-11024/13/2023-EST 1-CSE, Dated:07.08.2023.
7) Lr.No.100/2024, dated:06.08.2024 of A.P. United Teacher's Federation.

&&&&&

The attention of the Regional Joint Director of School Education, Kakinada is drawn to references read above, and it is informed that in the references 1st and 2nd read above, the Government has issued orders regarding provisionally allocated the cadre strength of the Commissioner of School Education in the District Offices amongst the 26 restructured districts and the same was communicated to the offices concerned in the state.

Further, in the references 3rd and 5th read above, the Government issued orders restructuring the existing (53) Educational Divisions into (74) Educational Divisions within the restructured districts by reallocating the existing Deputy Educational Officer posts in district offices to ensure that each of the 74 Revenue Division has one Deputy Educational Officer post, thereby strengthening the divisional supervisory structure of School Education Department in the districts. Subsequently, the same was communicated to all District Educational Officers in the state vide reference 6th cited.

In the reference 4th read above, the Government transferred the Ganapavaram Mandal from Eluru Revenue Division in Eluru District to the Bhimavaram Revenue Division in West Godavari District, as detailed in the appended Schedule-I (Copy enclosed).

Therefore, the Regional Joint Director of School Education, Kakinada

డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జారీ చేసిన ప్రొసీడింగ్ కాపీ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాల పునర్విభజన జరిగి రెండేళ్లు దాటినా కొన్ని శాఖల పరిపాలన అంతా ఏలూరు నుంచే సాగుతోంది. వీటిలో కొన్ని ముఖ్యమైన శాఖలు ఉండటంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేపట్టి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాను ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలుగా ఏర్పాటు చేసింది. అయితే జిల్లా పునర్విభజన తర్వాత ఏలూరు జిల్లా పరిధిలో ఉన్న గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో కలిపారు. 2023 ఫిబ్రవరి 16న రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ కూడా విడుదల చేసింది. తర్వాత గణపవరం మండలంలోని విద్యాశాఖ మినహా అన్ని శాఖలను పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేశారు. దీంతో గణపవరం మండలం విద్యాశాఖ ఏలూరు జిల్లాలోనే కొనసాగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో సుమారు 250 మంది ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, విద్యాశాఖ అధికారులు సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సైతం అవస్థలు తప్పలేదు. గణపవరం మండలం ఉపాధ్యాయులకు ఏలూరు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎన్నికల అధికారులు కూడా ఆ జిల్లా నుంచి ఈ జిల్లాకు ఉపాధ్యాయులను తిప్పడంతో వారు పడ్డ ఇబ్బందులు వర్ణనాతీతం. అలాగే సబ్జెక్టు టీచర్లు వర్క్‌షాప్స్, సమావేశాలు, పదో తరగతి పరీక్షల మూల్యాంకం విధులకు హాజరు కావడానికి సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ, పిడిఎఫ్ ఎంఎల్‌సిల పోరాట ఫలితంగా గణపవరం మండల విద్యాశాఖను పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోకి తీసుకొస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ గత అక్టోబర్ 16న ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీని ఆధారంగా గణపవరం మండల విద్యాశాఖకు సంబంధించిన అన్ని ఆపరేషన్స్ భీమవరం డిఇఒ కార్యాలయం కేంద్రంగా జరపాలని స్పష్టత కూడా ఇచ్చారు. అయినప్పటికీ పదో తరగతి విద్యార్థుల నామినల్ రోల్స్ విషయంలో పశ్చిమగోదావరి జిల్లాకు బదులు ఏలూరు జిల్లా అని చూపిస్తున్న పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఏం చేయాలో అర్థం కాక ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. దీనిని తక్షణమే మార్చాలనే డిమాండ్ ఉంది. పదో తరగతి పరీక్షలకు సంబంధించిన మీడియం ఆప్షన్‌ను ఎడిట్ చేసుకోవడానికి అవకాశం ఇచ్చినట్టుగానే నామినల్ రోల్స్‌లో జిల్లా ఆప్షన్‌నూ ఎడిట్ చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే ఏలూరు జిల్లా పరిధిలో జరుగుతున్న నీటి సంఘం ఎన్నికలకు గణపవరం మండలానికి చెందిన 18 మంది ఉపాధ్యాయులకు విధులు కేటాయించి శిక్షణకు హాజరవ్వాలని ఆర్డర్స్ కాపీలను వాట్సాప్‌లో పంపించడం చర్చనీయాంశమైంది. పశ్చిమలో పూర్తిస్థాయిలో విలీనమైనప్పటికీ ఈ విధంగా విధులు కేటాయించడం సరికాదని, వీటిని పున్ణపరిశీలించి సమస్యను పరిష్కరించాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తోంది.

అన్ని విభాగాలనూ విలీనం చేయాలి

జిడి.భవానీప్రసాద్, యుటిఎఫ్ గణపవరం మండల ప్రధాన కార్యదర్శి

యుటిఎఫ్, పిడిఎఫ్ ఎంఎల్‌సిల కృషి ఫలితంగా గణపవరం విద్యాశాఖను పశ్చిమలో విలీనం చేశారు. విద్యాశాఖకు సంబంధించిన సమాచారం అటు ఏలూరు జిల్లా, ఇటు పశ్చిమగోదావరి జిల్లాల నుంచి గణపవరం మండలానికి వస్తున్నాయి. దేనిని అనుసరించాలో తెలియక ఉపాధ్యాయులతోపాటు అధికారులు సైతం గందరగోళానికి గురవుతున్నారు. గణపవరం మండల విద్యాశాఖ అన్ని విభాగాలనూ పూర్తిస్థాయిలో పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేసి ఉపాధ్యాయుల ఇబ్బందులను తొలగించాలి.

ట్రాన్స్‌పోర్టర్లు సమన్వయంతో వ్యవహరించాలి

ఉచిత ఇసుక లోడింగ్ ఇబ్బందులను తొలగించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఉచిత ఇసుక లోడింగ్ ఇబ్బందులను తొలగించేందుకు ట్రాన్స్‌పోర్టర్లు సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. శనివారం స్థానిక వశిష్ట సమావేశ మందిరంలో జిల్లాలోని ట్రాన్స్‌పోర్టర్లతో ఆమె సమావేశమై రీచ్‌ల వద్ద ఇసుక లోడింగ్‌లో తలెత్తుతున్న సమస్యలపై చర్చించారు. ఏ రీచ్‌కు ఎన్ని వాహనాలు పంపిస్తున్నారు, వాహనం నెంబరు, డ్రైవర్ నెంబరు తదితర వివరాలను జిల్లా ఇసుక ఫెసిలిటేషన్ సెంటర్‌కు అందించాలని కలెక్టర్ సూచించారు. ఫెసిలిటేషన్ సెంటర్‌కు ఫోన్ చేసి ఇసుక రవాణాకు వాహనం కోరిన ఇసుక వినియోగదారునితో టైఅప్ చేసి రీచ్‌లో ఇసుక లోడింగ్‌లో సమస్యలు తలెత్తకుండా అక్కడ ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారి ద్వారా సమన్వయం చేస్తామని తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుండి నేటి వరకు 654 వాహనాల ద్వారా 14,100 టన్నుల ఇసుకను తూర్పుగోదావరి జిల్లా నుండి మన జిల్లాకు తరలించారన్నారు. ఇసుకను పూర్తిస్థాయిలో జిల్లాకు అందుబాటులో తేవడానికి ఎప్పటికప్పుడు తూర్పుగోదావరి జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవడంతో ప్రస్తుతం జిల్లాలో వినియోగదారులకు సరిపడా ఇసుక అందుబాటులోకి వచ్చిందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా రవాణా శాఖాధికారి టి.ఉమామహేశ్వరరావు, జిల్లా లారీ యూనియన్ అధ్యక్షులు రావూరి రాజా, రాష్ట్ర ఉపాధ్యక్షులు శిరిగినీడి శ్రీనివాసరావు, నాయకులు కోలా సత్యనారాయణ, కవురు నాగరాజు, పిండి శ్రీను, నక్కా సత్యనారాయణ, యాతం గణపతి, జె.ఆనంద్, శాండ్ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు తోలేరు విద్యార్థులు

విజేతలతో ఉపాధ్యాయులు, ప్రముఖులు

ప్రజాశక్తి - వీరవాసరం

68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ పోటీల్లో తోలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-14, 17 విభాగాల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివిఎంజెడ్.శ్యామ్‌ప్రసాద్ శనివారం తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు విశాఖపట్నంలో జరిగిన అండర్-14 బాలికల విభాగంలో ద్వితీయ స్థానం, నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన అండర్-17 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. అండర్-17 బాలుర విభాగం నుంచి వీరమల్లు మనోజ్, అండర్-14 బాలికల విభాగం నుంచి వేండ్ర రమ్యశ్రీ జాతీయస్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారని పీడీ పూడి శ్రీనివాస్ తెలిపారు. విజేతలైన క్రీడాకారులను, పీడీ శ్రీనివాసును పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామ్‌ప్రసాద్, ఎంపిపి వీరవల్లి దుర్గభవాని, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ పసుపులేటి హరి రామకృష్ణ, గ్రామ సర్పంచి వేండ్ర లీలా వెంకటకృష్ణ, ఉప సర్పంచి భోగిరెడ్డి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం : సిపిఎం

మాట్లాడుతున్న రాజా రామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - తణుకు

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. శనివారం స్థానిక అమరవీరుల భవనంలో సిపిఎం ఐదో పట్టణ మహాసభ అడ్డగర్ల అజయకుమారి, గుబ్బల గోపీ అధ్యక్షతన జరిగింది. తొలుత పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు గార రంగారావు ఆవిష్కరించారు. అమరవీరులైన సీతారాం ఏచూరి, రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్), మద్దాల వెంకటస్వామి, తాళ్లూరి మురళీ వెంకటేశ్వరరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయ్ మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక ప్రజలపై భారాలు వేయడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. దేశంలో ఎన్నడూ లేనివిధంగా నిరుద్యోగం, పేదరికం పెరిగాయన్నారు. స్వాతంత్రం వచ్చాక ఎన్నడూ లేని ధరలు నేడు ఉన్నాయన్నారు. ప్రపంచంలో మళ్లీ వామపక్ష ప్రభుత్వాలు అధికార, ప్రధాన ప్రతిపక్షాలుగా ముందుకొస్తున్నాయన్నారు. వామపక్షాలు అధికారంలోకి వస్తే కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తాయని, దీనికి కేరళనే నిదర్శనమని చెప్పారు. రానున్న కాలంలో ప్రజా సమస్యలపై పోరాటాలు విస్తృతంగా చేస్తామన్నారు. అనంతరం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ గత కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టగా ప్రతినిధులు చర్చించి ఆమోదించారు. సభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, నేతలు కామన మునిస్వామి, నాగరత్నం, పి.దక్షిణామూర్తి, పిఎల్.నర్సింహారావు, రాజశేఖర్, ముత్యాలరావు, శారద, శేషకుమారి, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి సమ్మె : 108 ఉద్యోగులు



నరసాపురం : ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తున్న 108 ఉద్యోగులు

ప్రజాశక్తి - నరసాపురం

తమ సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మె చేపడతామని 108 ఉద్యోగులు శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ దాసి రాజుకు సమ్మె నోటీసు అందించారు. తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. 108 అంబులెన్స్‌లను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, 108లో పని చేస్తున్న ఇఎంటి, పైలెట్లకు రూ.40 వేలు వేతనం అందించాలని, తమను వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వేతనాలను ప్రతినెలా 5వ తేదీలోపు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో 108 ఉద్యోగులు ఎ.రాజేష్, బి.శ్యామ్ పాల్గొన్నారు.

పాలకోడేరు: స్థానిక 108 ఉద్యోగులు రెవెన్యూ, మండల పరిషత్ అధికారులకు శనివారం సమ్మె నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 108ను నేరుగా ప్రభుత్వం నిర్వహించాలన్నారు. నిర్వహణా సంస్థలు మార్చే ప్రతిసారీ 108లో పనిచేసే ఉద్యోగులు గ్రాడ్యుటీ, వార్షిక ఇంక్రిమెంట్లు, ఇఎల్ అమౌంట్ బెనిఫిట్స్ నష్టపోతున్నారన్నారు. వేతనాలు సకాలంలో అందించకపోవడంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలన్నారు. ప్రస్తుతం కండీషన్లో లేని వాహనాలకు మరమ్మతులు చేయించి ఉద్యోగులు, క్షతగాత్రుల ప్రాణాలకు భద్రత కల్గించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 25వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 108 ఉద్యోగులు సమ్మెకు వెళ్తున్నట్టు చెప్పారు. వినతిపత్రాలు అందించిన వారిలో ఇఎంటి సీతారత్నం, పైలెట్ వెంకట్రావు, సిబ్బంది ఉన్నారు.

ఉచిత ఇసుక పంపిణీలో ప్రభుత్వం విఫలం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - నరసాపురం

పేదలకు ఉచిత ఇసుక అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. శనివారం మండలంలోని పసలదీవి గ్రామంలో సిపిఎం మండల మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథి బలరాం మాట్లాడుతూ ఆన్‌లైన్ ఇసుక విధానం వల్ల సామాన్యలకు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇసుక సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.17 వేల కోట్లు విద్యుత్ ఛార్జీల భారాన్ని వినియోగదారులపై మోపడం సరికాదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. సభకు తెలగంశెట్టి సత్యనారాయణ, బొక్కా శ్రీనివాసరావు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. అనంతరం ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా గ్రామ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, గుబ్బల నాగేశ్వరరావు, గుత్తుల శ్రీరామచంద్రుడు, కవురు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సేకరించిన 23 వేల టన్నుల ధాన్యానికి రూ.54 కోట్లు జమ

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. రైతులు ఎంపిక చేసుకున్న మిల్లుల్లో ధాన్యాన్ని అమ్ముకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలులో మన జిల్లా మొదటి స్థానంలో నిలిచేలా రైస్‌మిల్లర్లు సహకరించాలన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులు, రైస్‌మిల్లర్లతో ఆయన సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకు 23 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.54 కోట్లు ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎంతమంది రైతులు కోతలు కోశారు, ధాన్యం కళ్లాల్లో ఎంత ఉందనేది అడిగి తెలుసుకున్నారు. ధాన్యంతో మిల్లు వద్దకు వచ్చిన వాహనాలను తక్కువ సమయంలో దిగుమతి చేసి పంపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బహిరంగ మార్కెట్లో ధాన్యం విక్రయించే రైతులకూ కచ్చితంగా మద్దతు ధర దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన గోనె సంచులు, హమాలీలు, రవాణా వాహనాలు సమకూర్చాలన్నారు. ఏమైనా సమస్యలుంటే జిల్లాస్థాయి కంట్రోల్ రూమ్ నెం.8121676653ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా సివిల్ సప్లయీస్ మేనేజరు టి.శివరామప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఎస్‌ఒ ఎన్.సరోజ, ఎఎస్‌ఒ ఎం.రవిశంకర్, సహాయక మేనేజర్ పిడిఎన్.సత్యనారాయణ, జిల్లా రైసుమిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు, కార్యదర్శి కొత్త శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ సభ్యులు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలో కష్టపడిన వారికే పదవులు

తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

టిడిపి భీమవరం నియోజకవర్గ కార్యాలయంలో ఎపి ప్రభుత్వ రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఉప్పులూరి చంద్రశేఖర్‌ను పలువురు కూటమి నాయకులు శనివారం సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ పార్టీలో అంకితభావంతో కష్టపడి పనిచేసే వారికే పదవులు లభిస్తాయన్నారు. త్వరలో నియమించబోయే నామినేటెడ్ పదవుల్లో అన్ని సామాజిక వర్గాల కూటమి నాయకులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి ఎఎంసి మాజీ ఛైర్మన్ ఇందుకూరి రామలింగరాజు, వీరవాసరం, భీమవరం మండలాల నేతలు పాల్గొన్నారు.

సర్వేలో రైతులు వివరాలు తెలపాలి

వెటర్నరీ డిస్పెన్సరీ వైద్యాధికారి పివిఎన్‌టివి.ప్రసాద్

ప్రజాశక్తి - తణుకు రూరల్

జాతీయ పశుగణన సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించి విధిగా వివరాలు తెలియజేయాలని రేలంగి వెటర్నరీ డిస్పెన్సరీ వైద్యాధికారి పివిఎన్‌టివి.ప్రసాద్ కోరారు. ఐదేళ్లకోసారి నిర్వహించే సర్వే ద్వారా పశువులు, పెంపుడు జంతువుల సంఖ్య తెలుస్తుందన్నారు. ఈ నెల 21న జాతీయ పశు గణన కార్యక్రమంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి నెల వరకూ కొనసాగుతుందన్నారు. రోజుకు 30 ఇళ్ల చొప్పున సర్వే చేస్తున్నామన్నారు. రేలంగి పరిధిలోని కావలిపురంలో 824 కుటుంబాలకుగాను 182, రేలంగి గ్రామానికి సంబంధించి 4,251 కుటుంబాలకుగాను 236 కుటుంబాలకు సర్వే పూర్తయ్యిందన్నారు. ఈ రెండు గ్రామాల పరిధిలో సుమారు 2 వేల పాడి పశువులకు గత నెలలో గాలికుంటువ్యాధి, దొమ్మ, లంపీస్కిన్ వ్యాధుల నివారణకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ నెలాకరున బ్రూసెల్లోసిస్ వ్యాధికి టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

18న ధర్నాను విజయవంతం చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలివ్వాలని, ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న సిపిఐ ఆధ్వర్యంలో సచివాలయాల వద్ద నిర్వహించనున్న ధర్నాలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. శనివారం నాగిడిపాలెంలో జగనన్న నివాసిత స్థలాల లబ్ధిదారులకు కరపత్రాలు, వ్యక్తిగత దరఖాస్తులు పంపిణీ కార్యక్రమాన్ని సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ భీమవరం రూరల్ మండల కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, నాయకులు నాగిడి నాగరాజు, నాగిడి పాండు రంగారావు, తిరుమాని ధర్మరాజు పాల్గొన్నారు.

24న జిల్లాస్థాయి చెస్ పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 24న పాలకొల్లులోని యూరోకిడ్స్ స్కూల్లో జిల్లా ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోషియేషన్ అధ్యక్షులు మాదాసు కిషోర్ తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. పోటీల బ్రోచర్‌ను నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు విడుదల చేశారని కిషోర్ తెలిపారు. ఈ పోటీల్లోని విజేతలు రాష్ట్రస్థాయి రేపిడ్, బ్లిట్స్ చదరంగ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 9063224466 నంబర్‌ను సంప్ర దించాలని కోరారు.

ఆణిముత్యం తిలక్ వర్మ

ప్రజాశక్తి - ఉండి

భారత క్రికెట్‌కు దొరికిన ఆణిముత్యం నంబూరి తిలక్ వర్మ అని టిడిపి వాండ్రం గ్రామ అధ్యక్షులు కందుల బలరాం, నాయకులు గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు టి 20 మ్యాచ్‌ల్లో సౌత్ ఆఫ్రికా దిగ్గజ బౌలర్లను ఎదుర్కొని రెండు సెంచరీలు చేసి టి 20లో తనదైన ముద్రను వేసుకున్నాడన్నారు. నంబూరి తిలక్ వర్మ అమ్మమ్మ స్వగ్రామం ఉండి మండలం వాండ్రం కావడంతో గ్రామంలో సంబరాలు చేసుకున్నారు. తిలక్ వర్మ మున్ముందు జరిగే మ్యాచ్లలో రాణించి మంచి పేరు తేవాలన్నారు.

కొత్తపల్లికి సత్కారం

ప్రజాశక్తి - నరసాపురం

కాపు కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడుని సినీ నిర్మాత, జనసేన నాయకులు బన్నీ వాసు శనివారం సత్కరించారు. రుస్తుంబాదలోని కొత్తపల్లి నివాసానికి వచ్చిన వాసు భారీ గజమాల, శాలువాతో సుబ్బారాయుడిని సత్కరించారు. అనంతరం వీరిద్దరూ పార్టీ పరిస్థితిపై చర్చించారు. బన్నీ వాసు వెంట పాలకొల్లు జనసేన నాయకులు కూడా వచ్చి కొత్తపల్లికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తపల్లి మాట్లాడుతూ ఈ నెలాఖరులోపు ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తానన్నారు. కార్యక్రమంలో కె.తాతాజీ, గుగ్గిలపు మురళీ, వన్నెంరెడ్డి శ్రీను, మమ్ము, శ్రీను పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అత్తిలి: చట్టాలపై సరైన అవగాహన లేకపోవడం వల్లే అన్యాయానికి గురవుతున్నారని నాల్గో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జడ్జి సత్యవతి మాట్లాడుతూ మహిళలు చదువుకోవాలన్నారు. అన్యాయానికి గురైన మహిళలు ఎలా న్యాయం పొందాలో వివరించారు. రిసోర్స్ పర్సన్‌లు కౌరు వెంకటేశ్వర్లు, కోలా దుర్గాభవాని మాట్లాడుతూ గృహహింస, వరకట్న వేధింపులు, మహిళల పట్ల క్రూరత్వ, లైంగిక వేధింపులు, అపహరణ, యాసిడ్ దాడులు, మానవ అక్రమ రవాణా గురించి వివరించారు. ఉచిత న్యాయ సహాయం, సలహా కోసం జాతీయ న్యాయ సేవల సంస్థ టోల్‌ఫ్రీ నెంబర్ 15100కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, స్పెషల్ మేజిస్ట్రేట్ పిఎస్‌పి.చిరంజీవిరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్, సిడిపిఒ ప్రమోదినికుమారి, తహశీల్దారు వంశీ, ఎంపిడిఒ శామ్యూల్, ఎస్ఐ ప్రేమ్‌రాజ్, న్యాయవాదులు ముప్పిడి సుబ్బయ్య, తిర్రే సత్యనారాయణరాజు, కామన మునిస్వామి, ఎస్‌కె.మోతి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాస్ కుటుంబానికి మోషేనురాజు పరామర్శ

ప్రజాశక్తి - భీమవరం

శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మోషేనురాజు

బీ. వ ఎ వ ం ం గునుపూడికి చెందిన జర్నలిస్టు బోణం శ్రీనివాస్ (శ్రీను)ను వారి కుటుంబ సభ్యులను శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు శనివారం పరామర్శించారు. ఇటీవల శ్రీనివాస్ మాతృమూర్తి సరోజినీ అనారోగ్యంతో మృతి చెందారు. దీనిలో భాగంగా మండలి ఛైర్మన్ మోషేనురాజు వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మోషేనురాజు కుమారుడు కొయ్యే సుందర్‌రాజు, వాసర్ల ముత్యాలరావు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉల్లంపర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు రోటరీ క్లబ్ పాలకొల్లు వారి ఆధ్వర్యంలో బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, రోటరీ పోలియో రీజినల్ డిస్టిక్ ఛైర్మన్ మద్దాల వాసు, క్లబ్ సెక్రటరీ జవాజ్ కళ్యాణ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

భారాలతో ఎలా బతకాలి

విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల పెంపుపై పలువురి మనోగతం

ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రభుత్వం ప్రజలపై భారాలు వేయడం సరికాదు. ఇప్పటికే నిత్యవసర సరుకుల ధరలతో సతమతమవుతున్నాం. భారాలు వేస్తే ఎలా బతకాలి. కూటమి ప్రభుత్వం ధరలు తగ్గించాల్సింది పోయి పెంచుతోంది. ఇది సరికాదు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి. విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలపై పెంపుపై పలువురి మనోగతం..

విద్యుత్ భారాలతో సతమతం..

ఉద్దగిరి కామేశ్వరరావు, హోల్‌సేల్ కిరాణా వ్యాపారి, ఆచంట

ఇప్పటికే కరెంట్ బిల్లు కట్టలేక సతమతమవుతున్నాం. యూనిట్‌కు రూ.2.73 పైసలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించడం సరైన పద్ధతి కాదు. 2022లో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు మరలా సర్దుబాటు ట్రూఅప్ ఛార్జీల పేరుతో మాపై భారాలు వేయడం తగదు. తక్షణం విద్యుత్ ఛార్జీలు పెంచే విషయాన్ని విరమించుకోవాలి. ఏ ప్రభుత్వం వచ్చినా గత ప్రభుత్వం చేసిన తప్పిదాలంటూ ప్రజలపై భారాలు వేయడం ప్రజలను మోసం చేయడమే.

ఇది మోసపూరిత విధానం

చిక్కాల నాని, వ్యాపారి, ఆచంట

చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. దీనికితోడు రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఆదాయం చూస్తే అంతంత మాత్రంగానే ఉంటోంది. దీనికితోడు ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయడం ప్రజలను మోసం చేయడమే తప్ప మరొకటి లేదు. ఇప్పటికే ధరలు పెరుగుదలతో ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో వాడుకున్న కరెంటుకు ఏళ్లు గడిచిపోయాక అదనంగా ఛార్జీలు చెల్లించాలన్న విధానం మోసపూరితంగా ఉంది. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు నియంత్రిస్తామని, విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని హామీలు ఇచ్చి ఇప్పుడు మాట తప్పారు. ఛార్జీల భారాన్ని తక్షణం విరమించుకోవాలి.

ఇది ఆర్థిక భారమే..

కాసాని పెద్దిరాజు, జట్టు కూలీ, వీరవాసరం

కూటమి ప్రభుత్వం మాకు బుద్ధి చెబుతోంది. ఎన్నికల ముందు కరెంటు బిల్లులు పెంచబోమన్నారు. తీరా ఇప్పుడు చూస్తే ఏవో ఛార్జీలంటూ పెంచుతున్నట్టు చెబుతున్నారు. తిన్నా తినకపోయినా తప్పనిసరిగా కరంటు బిల్లు చెల్లించాల్సి వస్తోంది. ఒక పక్క ఇసుక కొరతతో నిర్మాణాలు లేక మాకు తగినంత పని లేదు. ఈ తరుణంలో కరెంటు ఛార్జీల పెరుగుదల మాలాంటి వారిపై తీవ్ర ఆర్థిక భారం ఉంటుంది.

ట్రూఅప్ ఛార్జీల పేరుతో భారం సరికాదు

కాకి రాజేష్, ఎలక్ట్రికల్ షాపు, వీరవాసరం

మేము చెల్లించినదానికి నాణ్యమైన కరెంటు సరఫరా అందివ్వడం లేదు. విద్యుత్ అక్రమంగా వాడుతున్న వారిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. అక్రమ వాడకందారులు వాడుకున్న కరెంటుకు ఎప్పుడో కరెంటు తయారీ ఖర్చంటూ ఇపుడు ట్రూఅప్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై అదనపు భారం వేయడం సరికాదు. కరెంటు అక్రమ వినియోగాన్ని అరికట్టండి. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కరెంటు ఛార్జీలు పెంచబోమన్న మాటకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉండాలి.

సహకార సంఘాల ద్వారా నాణ్యమైన సేవలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సహకార సంఘాల ద్వారా రైతులకు నాణ్యమైన సేవలందిస్తున్నామని జిల్లా సహకార సంఘం బ్యాంకు ఎజిఎం శంకర్ నారాయణ అన్నారు. శనివారం సహకార సంఘాల బ్యాంకు వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు బ్యాంకు చరిత్రలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎజిఎం శంకర్ నారాయణ మాట్లాడుతూ సహకార వ్యవస్థ అతిపురాతనమైందన్నారు. వంద ఏళ్ల చరిత్ర ఉన్న సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసి రైతులకు సేవలందిస్తామన్నారు. మేనేజర్ డి.వెంకటరెడ్డి నాయుడు మాట్లాడుతూ గతంలో రైతులకు సహకార బ్యాంకుల ద్వారా కేవలం పంట రుణాలు మాత్రమే అందించేవారమని, నేడు రైతులకు అవసరమైన ఇంటి రుణాలు, పిల్లలకు అవసరమైన విద్యారుణాలు, బంగారు నగలు తాకట్టుపై తక్కువ వడ్డీకి రుణాలతో పాటు కమర్షియల్ బ్యాంకుకు దీటుగా తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్నామన్నారు. అనంతరం 34 మంది విద్యార్థులకు పోటీలను నిర్వహించగా 14 మందికి బహుమతులను అందించామని నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది వి.సురేష్, ఎం.జానకిరామ్ తేజ, సిహెచ్.గోపీకృష్ణ, సర్‌సివి రామన్ స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత శైలజ, కళ్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు వీరే..

ప్రజాశక్తి - నరసాపురం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పోలిశెట్టి వీర వెంకట నారాయణ స్వామి (బాబ్జి)ని నియమించడం పట్ల వైఎస్‌పాలెం మాజీ సర్పంచి, సర్పంచుల ఛాంబార్ మండల మాజీ అధ్యక్షులు కూనపరెడ్డి రంగారావు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పోలిశెట్టి బాబ్జి నాయకత్వంలో నరసాపురం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందనే ఆకాంక్షను కూనపురెడ్డి రంగారావు ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలోనే ఆయన సూచాయిగా నియోజకవర్గానికి చెందిన విద్యావంతుడైన ఒకరు రాజకీయాల్లోకి ప్రవేశించబోతున్నారని ముందుగానే తెలియపర్చిన సంగతి విధితమే. ఆయన చెప్పినట్లుగానే నేడు ఒక బలమైన సామాజిక తరగతికి చెందిన పోలిశెట్టి బాబ్జిని నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించడం అభినందనీయమన్నారు. పోలిశెట్టి మరిన్ని ఉన్నత శిఖరాల అధిరోహించాలని ఆకాంక్షించారు.

పాలకొల్లు : బాధ్యతలు చేపట్టిన హరికిరణ్

పాలకొల్లు : కాంగ్రెస్ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పిసిసి సభ్యులు కొరగింజల హరికిరణ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను మూడు రోజుల క్రితం పిసిసి అధ్యక్షురాలు షర్మిల నియమించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలతో పాటు పాలకొల్లులో కొత్త ఇన్‌ఛార్జిని నియమించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పాలకొల్లులో తిరిగి కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొస్తానని చెప్పారు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గం, మండల, పట్టణ కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరడానికి పలువురు యువకులు ముందుకొస్తున్నారని షర్మిలను పాలకొల్లు తీసికొచ్చి పార్టీని పటిష్టం చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వర్ధనపు కాసు, మహమ్మద్ జానీ, జాన్ బెన్నిపాల్, నాగ మోహన్‌రావు, గోగులమండ భాస్కరరావు పాల్గొన్నారు.

పిల్లలకు గ్రంథాలయాలను అలవాటు చేయాలి

భీమవరం టౌన్: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు బాల్యం నుంచి గ్రంథాలయాలకు అలవాటు చేయాలని మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ ఎంవి.ప్రసాద్ అన్నారు. శనివారం చదువురుల సంఘం, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా భీమవరం సిఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో కేన్సర్ వ్యాధిపై, రోడ్డు ప్రమాదాలపై, గ్రంథాలయ ఆవశ్యకతపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ ప్రసాద్ మాట్లాడారు.

నరసాపురం : ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం వద్ద గ్రంథాల వారోత్సవాల సందర్భంగా శనివారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పుస్తక అన్వేషణ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ కెజెఎస్ ఎల్.కుమారి, ఎం.కృష్ణ ప్రసాద్, రాజేంద్రరెడ్డి, గోపాలకృష్ణ, ధవేజీ పాల్గొన్నారు.

పెనుమంట్ర : గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొని, దేశానికి విలువైన సేవలందించిన ప్రముఖులు అయ్యంకి వెంకట రమణయ్య, డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం మొదలైన వారిని స్మరించడం నేటితరం బాధ్యత అని లైబ్రరీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, మార్టేరులోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ జి.రామారెడ్డి అన్నారు. శనివారం శాఖా గ్రంథాలయంలో వివిధ పోటీలు విద్యార్థులకు నిర్వహించారు.

శశి విద్యార్థులకు పతకాల పంట

తాడేపల్లిగూడెం : జెఎన్‌టియు కాకినాడ యూనివర్సిటీ స్థాయి సెంట్రల్ జోన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 2024-25లో శశి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 17 పతకాలు సాధించి సత్తా చాటారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహమ్మద్ ఇస్మాయిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల 200 మీటర్ల విభాగంలో బి.హిమ తేజస్విని రజత పతకం, 1500 మీటర్ల విభాగంలో పిపి.స్వాతి స్వరూప రజతం, షార్ట్‌పుట్‌లో యు.యసశ్రీ రజతం, డిస్కస్ త్రోలో కాంస్యం, 4/100 మీటర్ల రిలే పరుగు పందెంలో పి.స్వాతి స్వరూప, ఎ.నాగ నందినీ, బి.హిమ తేజస్విని, టి.హిమదుర్గ రజత పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. పురుషుల విభాగంలో హైజంప్‌లో పి.చక్ర మణికంఠ రజతం, 400 మీటర్ల పరుగు పందెంలో కాంస్యం, పదివేల మీటర్ల పరుగు పందెంలో కెఎన్‌వి.దుర్గారావు, జావెలిన్ త్రోలో ఎం.శరణ్, 4/400 రిలే పరుగు పందెంలో పి.భరత్, పి.చక్రమణికంఠ, బి.ప్రిన్స్‌బాబు, జెబివి.ఆదిత్య కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

రావి పద్మకుమారి మృతి పట్ల సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - ఏలూరు

ప్రముఖ వైద్యులు, జిల్లా ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య భార్య రావి పద్మకుమారి మృతి పట్ల సిపిఎం సంతాపం తెలిపింది. పద్మకుమారి అనారోగ్య కారణంతో అకస్మాత్తుగా మృతి చెందడం పట్ల సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా రవి డాక్టర్ గోపాలకృష్ణయ్యను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గోపాలకృష్ణయ్య కమ్యూనిస్టు అభిమానిగా అనేక ఉద్యమాలకు, కార్యక్రమాలకు మద్దతు ఇస్తుంటారని తెలిపారు. ప్రముఖ వైద్యులుగా పేరొందడంతోపాటు సేవా తత్ప రులని గుర్తుచేశారు. తన వృత్తి జీవితంలో అనేకమంది ప్రజలకు వైద్య సహాయాన్ని అందించారని తెలిపారు. భర్త గోపాలకృష్ణయ్యతో కలిసి అనేక సేవా కార్యక్రమాల్లో పద్మకుమారి కూడా పాలుపంచుకునే వారన్నారు. ముఖ్యంగా పద్మకుమారి పేద విద్యార్థులు, మహిళలకు సాధన ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. శుక్రవారం ఉదయం ఆకస్మికంగా పద్మకుమారి మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని కల్గించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మకుమారి మృతి పట్ల సంతాపం తెలిపిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం ఉన్నారు. పద్మకుమారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, తాడేపల్లిగూడెం

ఇ.పి.నెం.9/2024 ఇన్ ఓ.ఎస్.నెం.212/2022

బిట్వీన్:
రెడ్డి సత్యనారాయణ
...డి. హెచ్. ఆర్ /ప్లెయింటిఫ్
మద్దుకూరి నాగేశ్వరరావు
...జె. డి. ఆర్ /డిఫెండెంట్

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఆస్తి వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ బాకీ గాను ప్రతివాది /జె.డి.ఆర్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి **ది. 28-11-2024 వ తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు పై కోర్టులో వేలం వేయబడును.** షరతులు తెలుసుకొని పాడుకొనవలెను.

షెడ్యూలు: పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, జగన్నాదపురం గ్రామం తాలూకు వ్యవసాయ భూమి bearing R.S.No.115 to an extent of Ac.0-60 Cents of Agriculture land bounded by:
East: Talla Venkateswarao's Land.
South: Maddhukuri Ramarao's Land.
West: Land of Siddhina Sirisha.
North: Siddhina Venkataswararao's Land. & Etc., Land.

పై హద్దుల మధ్య య.0-60 సెంట్లు గల వ్యవసాయ భూమి సమస్త ఈజుమెంటు హక్కులతో సహా.
వాది /డి.హెచ్.ఆర్ వాల్యూ /కిమ్మత్తు : రూ.10,00,000/-
అమీనా వాల్యూ /కిమ్మత్తు : రూ.20,00,000/-

MUTYALA SUNIL KUMAR
Advocate for D.H.R.
Tadepalligude.

బొబ్బిలి వంతెన నిర్మించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు

ప్రజాశక్తి - గణపవరం

ప్రమాదభరితంగా ఉన్న గణపవరం బొబ్బిలి వంతెనను ప్రభుత్వం వెంటనే నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బిటి.రణదీవె భవనంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు ఈ సమావేశానికి మండల కమిటీ సభ్యులు మేడిశెట్టి పెంటారావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో బాబూరావు మాట్లాడుతూ స్థానిక వెంకయ్య వయ్యేరుపై ఉన్న బొబ్బిలి వంతెన నిర్మాణం విషయంలో అధికార పక్ష నాయకులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని, ఇప్పటికే శిథిలావస్థకు చేరిన వంతెన ప్రమాదకరంగా ఉందన్నారు. ప్రాణనష్టం కలగక ముందే వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే సామాన్యుల వేతనాలు పాతాళంలో ఉన్నాయన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి పి.నరశింమూర్తి, సభ్యులు చిన్నం చిన నాగేశ్వరరావు, సోడదాసి సంజీవిరావు, ఎం.నాగయ్య పాల్గొన్నారు.

పరిశుభ్రమైన తాగునీరందించాలి

వీరవాసరం: వీరవాసరం గ్రామస్తులకు పరిశుభ్రమైన తాగునీరందించాలని సిపిఎం శాఖా మహాసభ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరింది. శాఖ మహాసభ శనివారం బాలం విజయకుమార్ అధ్యక్షతన జరిగింది. ఇటీవల కాలంలో పంచాయతీ కుళాయి ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు బురదగా వస్తోందని సమావేశం తెలిపింది. గ్రామస్తులు అధిక సంఖ్యలో పంచాయతీ నీరు తాగుతున్నారని సమావేశం తెలిపింది. ఫిల్టర్ చేసిన తాగునీరు సరఫరా చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరింది. అనంతరం గ్రామ శాఖా కార్యదర్శిగా రెడ్డి రామారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, యండమూరి సుబ్బారావు, శ్యాంబాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

మొగల్తూరు: పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఓటర్లు దరఖాస్తు చేసుకున్న పత్రాలను శనివారం రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. ఎంఎల్‌సి ఎన్నికల ఓటర్ల నమోదుకు ఈ నెల 6వ తేదీతో గడువు ముగిసింది. ఓటు హక్కు కోసం సుమారు 2500 దరఖాస్తులందాయి. వీటిలో కొన్ని అటెస్టేషన్ లేకుండా అందించడం, డిగ్రీ పూర్తయి మూడు సంవత్సరాలు పూర్తికాకపోవడం తదితర అభ్యంతరాలు వెలుగు చూసాయి.

కాళ్లకూరు వెంకటేశ్వరాలయంలో కార్తీక శోభ

కాళ్ల: కాళ్లకూరు వెంకటేశ్వర స్వామి ఆలయం కార్తీక దీపాలతో దేదీప్యమానంగా వెలిగిపోయింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా వేలాది సంఖ్యలో యాత్రికులతో ఆలయానికి తరలివచ్చి వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో యాత్రికులందరూ కార్తీక దీపాలను వెలిగించారు. ఉదయం నుంచి ఆలయ ఇఒ అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

CHANGE OF NAME

I, **SULTANEMOBEEN,** W/o.MEER RAHAMATH ALI, resident of D.No.6B-2-54, resident of Eluru, Eluru Mandal, Eluru Dist, A.P have changed my name from **MOBEENA SULTHANA MEER** (Old Name) to **SULTANEMOBEEN** (New Name). Hence forth Iam being called as **SULTANEMOBEEN** (New Name) for all purposes.

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో

E.P. No. 84/2013 in OS. No. 151/2007

బిట్వీన్:
1.కోనాల వీర వెంకట సత్యనారాయణ రెడ్డి **(died)**
2.కోనాల వెంకట రెడ్డి ....డిక్రీ హోల్డర్స్
(as per orders in EA72/24, dt. 07-05-2024)
2nd DHR is added

Vs

రేపాక ఆనందరావు
టు ....జడ్జిమెంట్ డేట్టార్
రేపాక ఆనందరావు
S/o ఇజ్రాయేలు, వయసు 55 సం.రాలు
దిగమర్రు, పాలకొల్లు మండలం

పై నెంబరు EP గ్రంథములో జడ్జిమెంట్ డేట్టార్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది. **04-12-2024**వ తేదీన ఉ.గం. **10-30** ని.ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

Item.No.1: పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు సబ్-రిజిస్ట్రారులో చేరిన పాలకొల్లు మండలం, దిగమర్రు గ్రామంలో య.1.00 సెంట్లు RS no.312లో దక్షిణం వైపున గల య.0.50 సెంట్లు భూమికి హద్దులు.
తూర్పు : రేపాక కాసులు గారి భూమి
పడమర : కొల్లాబత్తుల మేరి సుశీల గారి భూమి
దక్షిణము : మురుగు కాలువ
ఉత్తరం : మందపాటి పెద్దిరాజు గారి భూమి

అమీనా విలువ Rs. 2,00,000/-
DHR విలువ Rs. 1,90,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

యం. వెంకట రామిరెడ్డి
పాలకొల్లు అడ్వకేటు
ది.16-11-2024

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

డిసెంబర్ 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని మండల సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి మహ్మద్ షేక్ సికిందర్ భాషా తెలిపారు. శనివారం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సూర్యకిరణశ్రీ, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నామణి, తాడేపల్లిగూడెం టౌన్, రూరల్, నల్లజర్ల ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్లలో అన్న సమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లలో రుక్మిణీ సమేత పాండురంగస్వామి కళ్యాణ మహోత్సవాల సందర్భంగా అఖండ అన్నసమారాధన శనివారం నిర్వహించారు. శాశ్వత ధర్మకర్త మందలపర్తి శ్రీచంద్రశేఖర్, కమిటీ సభ్యులు కమిటీ సభ్యులు బండారు నాయుడు, నారిన తాతయ్య, బండారు వేణుగోపాలరావు, గోళ్ల నాగేశ్వరరావు, బండారు సోమేశ్వరరావు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, నారిన శ్రీనివాసరావు, కడలి దుర్గాప్రదీప్, బండారు సాయిపద్మారావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - నరసాపురం

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా సంరక్షణ అధికారి బి.నెహ్యామ్మ అన్నారు. శనివారం పట్టణంలో కొత్తపల్లి సుబ్బారాయుడు హైస్కూల్లో బాలల హక్కులపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయన్నారు. బాలల చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎన్.పద్మావతి, హెచ్ఎం రాజు, బి.కృష్ణవేణి, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య

ప్రజాశక్తి - నరసాపురం

మురుగునీటి పారుదలకు ఆటంకంగా ఉన్న ఆక్రమణలను తక్షణం తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం పట్టణంలోని మురుగు కాలువల్లో పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ తీసిన పూడికను రోజులు తరబడి అక్కడే ఉంచకుండా వెంటనే తొలగించాలన్నారు. పట్టణంలోని గోడలు, డివైడర్లపై పోస్టర్లు, స్టిక్కర్లు అతికించకుండా చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 335/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
మరియు
D-1) కాసాని సీతారామయ్య అండ్ అనదర్ ...ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: కాసాని సీతారామయ్య, S/o. పెదముసలయ్య, డోర్ నెం. 5-107, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 20-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 15-11-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 229/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
మరియు
D-1) కట్టా వెంకటరావు
D-2) వేముల అశ్వనికుమార్ ...ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: కట్టా వెంకటరావు, S/o. తాతయ్య, డోర్ నెం. 4-112, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల అశ్వనికుమార్, S/o. భాస్కరరావు, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 20-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 15-11-2024 సెల్: 98662 59514